రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.18, బెండ రూ.35, పచ్చిమిర్చి రూ.45, కాకరకాయ రూ.35, బీరకాయ రూ.35, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.09, క్యారెట్ రూ.18, దొండ రూ.28, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.24, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.09, పొట్లకాయ రూ.16, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.55, చామగడ్డ రూ.40, మునగ రూ.23, కందగడ్డ రూ.70, బీట్‌రూట్ రూ.17, కీర రూ.18, బీన్స్ రూ.55, క్యాప్సికమ్ రూ.35. ఈ ధరలు సోమవారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

రాజీవ్ యువ వికాసం గడువు పొడిగించాలి


బొడ్డుపల్లి కృష్ణ

నాగోలు: రాజీవ్ యువ వికాస పథకం గడువు పొడిగించాలని బీసీ హక్కుల సమితి రాష్ట్ర నాయకులు బొడ్డుపల్లి కృష్ణ ఓ ప్రకటనలో కోరారు. రాజీవ్ యువ వికాస పథకం, నిరుద్యోగ యువతి, యువకులకు, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ, బీసీలకు రూ.లక్ష నుంచి నాలుగు లక్షలు, సబ్సిడీతో కూడిన రుణాలు మంజూరు చేస్తామని ప్రకటించడం సంతోషదాయకమే అయినా ఈ యువ వికాస ఉపాధి పథకానికి అర్హులను ఎంపికలో కొన్ని నిబంధనలు పెట్టారని, వాటికి అనుగుణంగా సంబంధిత ధ్రువ పత్రాలు జతపరచాలంటే ప్రభుత్వం ప్రకటించిన గడువు సరిపోదదన్నారు. రేషన్ కార్డులకు దరఖాస్తు చేసుకున్న కుటుంబాలు లక్షల మంది ఉన్నారని, రేషన్ కార్డు లేకుండా ఆయ ధ్రువ పత్రాలు పొందాలంటే, రెవెన్యూ నిబంధనలు అంగికరించడం లేదన్నారు. రేషన్ కార్డులు ఇవ్వకుండా, ఆదాయ ధ్రువపత్రాలు అందకుండా రాజీవ్ యువ వికాసానికి దరఖాస్తు చేసుకోవడం సాధ్యం కాదన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం


టోర్నమెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కౌన్సిలర్ వేణుకుమార్‌గౌడ్

పహాడీషరీఫ్: విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని మామిడిపల్లి మాజీ కౌన్సిలర్ ఈరంకి వేణుకుమార్‌గౌడ్ అన్నారు. రంగ నాయకుల కాలనీ క్రికెట్ టోర్నమెంట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. యువత చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలు మానసికోల్లాసం పెరుగుతుందన్నారు. స్పోర్ట్స్‌లో రాణించడం ద్వారా కూడా ప్రభుత్వ ఉద్యోగాలు సాధించవచ్చన్నారు. క్రీడల పట్ల మక్కువ ఉన్న వారిని ప్రభుత్వాలు వెన్నుతట్టి ప్రోత్సహించాలని కోరారు.

ఘనంగా ఇఫ్తార్ విందు


ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

పహాడీషరీఫ్: ఇఫ్తార్ విందులు సోదరభావాన్ని పెంచుతాయని ఎడ్ల వాసుదేవారెడ్డి, పెరమోని నరేశ్ అన్నారు. ఆదివారం మామిడిపల్లిలో మహ్మదియా మసీదులో వారు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో మసీదు ముతవల్లీ అలీ తుర్కీ, అడ్వకేట్ నయీమ్, సయీద్ జాన్, గణేశ్‌గౌడ్, క్లౌం నరేశ్‌గౌడ్, జాకేర్, అమేర్ తదితరులు పాల్గొన్నారు.


కర్మన్‌ఘాట్ ధ్యానాంజనేయ స్వామి ఆలయంలో..


పంచాంగ పఠనం వింటున్న భక్తులు

వైభవంగా ఉగాది వేడుకలు

- ఆలయాలలో బారులుతీరిన భక్తులు
- ప్రత్యేక పూజలు, అభిషేకాలతో సందడి

ఎల్‌బీనగర్, మలక్‌పేట నియోజకవర్గాల్లో ఉగాది వేడుకలను వైభవంగా నిర్వహించారు. ఆయా ప్రాంతాల్లోని ఆలయాలకు ఆదివారం వేకువజాము నుంచే భక్తులు బారులుతీరి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. సాయంత్రం నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమానికి కాలనీలు, బస్తీల నుంచి ప్రజలు తరలివచ్చారు.

– ఎల్‌బీనగర్, మలక్‌పేట జోన్ల బృందం


అష్టలక్ష్మీదేవాలయంలో నూతన తెలుగు సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ దయానంద్‌గుప్తా


దిల్‌సుఖ్‌నగర్ సాయి ఆలయంలో పంచాంగ పఠనం చేస్తున్న దరూరి మురళీధరాచార్యులు


దేవులపల్లి పవనకుమార్ సిద్ధాంతికి పురస్కారం అందజేస్తున్న నిర్వాహకులు


అష్టలక్ష్మీ ఆలయంలో పంచాంగశ్రవణ చేస్తున్న పండితులు


మలక్‌పేట హనుమాన్ మల్లికార్జున దేవాలయంలో..


ఉప్పరిగూడ రామాలయంలో పంచాంగ శ్రవణంలో పాల్గొన్న స్థానికులు


ప్రసాద వితరణ చేసిన జంగం శ్వేతామధుకర్‌రెడ్డి


విజేతలను సత్కరిస్తున్న నిర్వాహకులు


పంచాంగ శ్రవణంలో పాల్గొన్న భక్తులు

సుందర ప్రహ్లాదాచార్యులుకు వంశీ ఉగాది పురస్కారం


పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న పుష్పగిరి విద్యాశంకర భారతి మహాస్వామి

చిక్కడపల్లి: కలియుగంలో ఆధ్యాత్మిక మార్గమే రక్షణ కల్పిస్తుందని పుష్పగిరి విద్యాశంకర భారతి మహాస్వామి అన్నారు. చిక్కడపల్లిలోని ఆదివారం రాత్రి త్యాగరాయ గానసభలో విశ్వావసు నామ ఉగాది నామ సంవత్సరం సందర్భంగా వంశీ సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా టీటీడీ వేదపండితుడు భట్టార్ సుందర ప్రహ్లాదాచార్యులుకు వంశీ ఉగాది పురస్కారాన్ని ప్రదానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంశీ రామరాజు, మీనాక్షి, రేలంగి నరసింహారావు, చంద్రశేఖర్, టి.సుధాదేవి, సుధామయి, తులసీరామ్, సంతోష్‌కుమార్, భాస్కరరావు, సురేష్‌శర్మ, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సేవ చేయడంలోనే ఆనందం

కాచిగూడ: అందరూ సేవాభావం అలవర్చుకుంటే సమాజం ఎంతో అభివృద్ధి చెందుతుందని కాచిగూడ బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి డాక్టర్ బద్దుల శిరీష ఓం ప్రకాష్ యాదవ్ అన్నారు. టీఆర్‌ఎస్ వ్యవస్థాపక సభ్యులు సునిల్ బిడ్లాన్ ఆధ్వర్యంలో ఆదివారం కుద్బిగూడలో 28 సంవత్సరాలుగా ప్రతి వేసవిలో ఏర్పాటు చేస్తున్న చలివేంద్రాన్ని ఆమె ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. నిత్యం రద్దీగా ఉండే ఈ చౌరస్తాలో ప్రజలకు స్వచ్ఛమైన చల్లని నీరు అందించడం అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్‌పటేల్ గౌడ్, బీఆర్‌ఎస్ సీనియర్ నేత దాత్రిక్ నాగేందర్ బాబ్జీ, బబ్లూ సింగ్, అంటో, ఎల్.రమేష్, బి.శ్రీకాంత్, మహేష్, రాజేష్, సచిన్ తదితరులు పాల్గొన్నారు.



తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతులు



గౌలిపురా: హనుమాన్‌నగర్ ఫేజ్–3 కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి పైప్ లైన్ జాయింట్ పగిలిపోయి 15 రోజులుగా స్థానిక, పరిసర ప్రాంతాల బస్తీలకు తాగునీరు అందక తీవ్ర ఇబ్బందులకు గురువుతున్నారు. ఈ విషయమై సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యులు గడ్డమీది చంద్రమోహన్‌గౌడ్ అలియాబాద్ జలమండలి డివిజన్ డీజీఎం, జీఎంలకు ఫిర్యాదు చేసి మరమ్మతులు చేపట్టాలని సూచించారు. దీంతో సంబంధిత అధికారులు తాగునీటి పైప్‌లైన్‌కు మరమ్మతు పనులను చేపట్టారు. దీంతో యధావిధిగా నీటి సరఫరా జరుగుతుంది.

పార్కుల్లో మెరుగైన సదుపాయాలు కల్పిస్తా


అసోసియేషన్ సభ్యులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: మహావీర్ హరిణ వనస్థలి జాతీయ పార్కు ప్రధాన గేట్ వాకర్స్‌కు సదుపాయాలు కల్పిస్తానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. హరిణ వనస్థలి వాకర్స్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం ఎమ్మెల్యేను కలిసి ఓపెన్‌జిమ్, ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంటు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పార్కులో నిత్యం 500 మందికి పైగా వాకింగ్ చేస్తున్నారని, వారి అవసరాల దృష్ట్యా వసతులు కల్పిస్తానని తెలిపారు. పార్కులో యోగా షెడ్‌ను ఏర్పాటు చేస్తానని, రెండు రోజుల్లో పార్కును సందర్శించి ఓపెన్ జిమ్‌ను ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. జగదీష్‌యాదవ్, వెంకట్‌రెడ్డి, మధుసూదన్ రెడ్డి, లింగారెడ్డి, లక్ష్మారెడ్డి, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం


చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఐ నాగరాజు

మన్సూరాబాద్: సహారాస్టేట్స్‌కాలనీ ప్రధాన గేటు వద్ద సామాజిక కార్యకర్త గంగదాసు కృష్ణారెడ్డి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆదివారం బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా మాజీ అధ్యక్షుడు సామ రంగారెడ్డి, కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మీర్‌పేట్ ఇన్‌స్పెక్టర్ నాగరాజు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవిలో స్వచ్ఛమైన నీరు అందించేందుకు కాలనీలో చలివేంద్రం ఏర్పాటు చేయటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్‌జానీ, వెంకటాద్రి, గంజి ప్రకాష్, సుదర్శన్ రెడ్డి, శేఖరయ్య, ప్రసాద్‌రావు, వెంకట్‌రెడ్డి, అనంత రెడ్డి, జ్ఞానేశ్వర్‌రావు, విశ్వనాథ్ పాల్గొన్నారు.

స్విమ్మింగ్‌పూల్ ప్రారంభం

డివిజన్ పరిధి సహారాస్టేట్స్‌కాలనీలో ఏర్పాటు చేసిన స్విమ్మింగ్‌పూల్‌ను కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. వేసవిలో కాలనీవాసులు, యువత సేద తీరడానికి స్విమ్మింగ్‌పూల్‌ను అందుబాటులోకి తీసుకరావటం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు సయ్యద్ జానీ, సుదర్శన్‌రెడ్డి, శేఖరయ్య, మహేష్, వెంకటాద్రి, జ్ఞానేశ్వర్‌రావు, నాయకులు హరీష్‌రెడ్డి, రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

రిజర్వేషన్లపై బీసీ కుల సంఘాలతో సీఎం చర్చించాలి


గుజ్జ సత్యం

కాచిగూడ: బీసీలకు విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు 42 శాతానికి పెంచుతూ అసెంబ్లీలో రెండు బిల్లులు పాస్ చేయడం చరిత్రాత్మకమని బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం పేర్కొన్నారు. ఈ రిజర్వేషన్లపై బీసీ సంఘాలతో చర్చించేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమావేశాన్ని ఏర్పాటు చేయాలని ఆయన ఒక ప్రకటనలో కోరారు. స్థానిక సంస్థలలో రిజర్వేషన్ల పెంపు అంశంలో ఇబ్బంది లేదన్నారు. విద్య, ఉద్యోగ రిజర్వేషన్లకు సంబంధించి రాజ్యాంగ సవరణ అవసరం కావచ్చన్నారు. తెలంగాణలో జరుగుతున్న బీసీ ఉద్యమంతో దేశంలోని బీసీలు అందరూ ఉద్యమానికి సిద్ధమవుతున్నారని ఆయన తెలిపారు.

◆ బిల్లులను కేంద్రానికి పంపించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులిపేసుకోవడం సరి కాదన్నారు. బిహార్, తమిళనాడులో రిజర్వేషన్లు పెంచినప్పుడు బిల్లులు ఆమోదం పొందడానికి చట్టాలు చేసినప్పుడు జీవోలు జారీ చేసి ఉద్యోగాల భర్తీ చేశారని ఆయన వివరించారు. రిజర్వేషన్ల పెంపుదల శాతాన్ని కోర్టులు కొట్టివేయకుండా కేంద్రంపై వత్తిడి తెచ్చి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చి సవరించిందని ఆయన గుర్తు చేశారు. సుప్రీంకోర్టు ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్ కేసులో 50శాతం సీలింగ్ ఎత్తివేసిందన్నారు. న్యాయ నిపుణులతో చర్చించి అమలు కోసం పకడ్బందీగా చర్యలు చేపట్టాలని కోరారు.

'రాగి, వేప చెట్లకు ఎంతో ప్రాముఖ్యత ఉంది'

కాచిగూడ: చెప్పల్‌బజార్‌లోని శ్రీఆంజయనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ఆలయ కమిటీ ప్రతినిధులు దాత్రిక్ నాగేందర్ బాబ్జి, ఇజాఫా కృష్ణ తదితరులు ఆదివారం రాగి, వేప మొక్కలను నాటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాగి, వేప చెట్లకు ఎంతో ప్రాముఖ్యం ఉందన్నారు.

అమ్మవారి దర్శనం..పోటెత్తిన భక్త జనం



చార్మినార్: చార్మినార్ భాగ్యలక్ష్మి అమ్మవారి దర్శనానికి భక్తులు పోటెత్తారు. ఆలయంలో ఉగాది, చైత్ర నవరాత్రి మహోత్సవ వేడుకలు ఆదివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈనెల 30న ప్రారంభమైన ఈ వేడుకలు ఏప్రిల్ 6వ తేదీ వరకు జరగనున్నాయని ఉత్సవాల నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 వరకు ఘట స్థాపన పూజా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మాతారాణి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. ఏప్రిల్ 5న రాత్రి 7 నుంచి అర్ధరాత్రి 12 గంటల వరకు అష్టమి హవన్ పూజా కార్యక్రమాలు ఉంటాయని ఆలయ ట్రస్టీ శశికళ తెలిపారు. ఆరోజు అమ్మవారు మోహిని రూపంలో దర్శనమిస్తారని, చెప్పన్ బోగ్ పూజా కార్యక్రమాలు కూడా ఉంటాయన్నారు. ఏప్రిల్ 6న అంటే.. నవమి నాడు భాగ్యలక్ష్మి అమ్మవారి పల్లకీ సేవ శోభాయాత్ర ఉంటుందన్నారు. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ఈ భవ్య శోభాయాత్ర కొనసాగుతుందన్నారు.

పేదల బియ్యం పక్కదారి!

- పాలిష్ చేసి సన్నబియ్యంగా విక్రయం
- పట్టించుకోని అధికారులు



దిల్‌సుఖ్‌నగర్: పేదల సౌకర్యార్థం ప్రభుత్వం నెల నెల అందజేస్తున్న రేషన్ బియ్యం దళారుల చేతుల్లోకి వెళ్తున్నాయి. రోజు రోజుకు పెరిగిపోతున్న బియ్యం ధరలు మధ్యతరగతి ప్రజలను కుంగదీస్తుంటే పెరుగుతున్న ధరలను ఆసరాగా చేసుకుంటున్న దళారులు రేషన్ బియ్యాన్ని మళ్లీ పాలిషింగ్ చేసి సన్నబియ్యంగా మార్చి జిగేల్‌మనే సంచుల్లో నింపి మార్కెట్‌లో అమ్ముతున్నారు. మలక్‌పేట్, సరూర్‌నగర్, సంతోష్‌నగర్ సర్కిళ్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో యథేచ్ఛగా కల్తీకి పాల్పడుతున్నా అధికారులలో చలనం లేకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది. సహజంగా ఎక్కువ మంది ఇష్టపడి తినే సన్నరకం బియ్యం కోసం ధరలు కాస్త ఎక్కువైనా లెక్కచేయకుండా తీసుకునే ప్రజల నాడిని తెలుసుకున్న వ్యాపారులు బహిరంగంగా మార్కెట్లో వినియోగదారులకు చుక్కలు చూపుతున్నారు.

పెరిగిన ధరలను సాకుగా చూపుతూ..

పెరిగిన ధరలను సాకుగా చూపుతూ వ్యాపారులు అధిక లాభాలను ఆర్జించాలనే స్వార్థంతో సన్నరకం రూపాయి కిలో బియ్యాన్ని ప్రత్యేక మిషిన్‌లలో పాలిష్ చేసి సోనామసూరి బియ్యంలో కలుపుతూ వినియోగదారుని నోట్లో మట్టికొడుతున్నారు. గడిచిన రెండేళ్లలో బహిరంగ మార్కెట్లో బియ్యం ధర రూ. 55 నుంచి రూ. 65 చేరుకోవడంతో సామాన్యుడు కొనలేని పరిస్థితి నెలకొంది. ప్రభుత్వం మాత్రం బహిరంగ మార్కెట్లో పెరిగిన ధరలను అదుపుచేసి కిలో బియ్యం రూ. 42 నుంచి రూ. 50 మించిలేవని గొప్పలు చెబుతున్నా ఆచరణలో ఎక్కడా ధరలు తగ్గిన పరిస్థితి లేదు. సామాన్య, మధ్యతరగతి ప్రజలు బియ్యాన్ని కొనలేని పరిస్థితులు నెలకొన్నాయి. ప్రజల బలహీనతలను తెలుసుకున్న వ్యాపారులు అధిక ధర విలువ చేసే సోనామసూరి బియ్యంలో నాసిరకం బియ్యం కలుపుతూ సొమ్ము చేసుకుంటున్నారు. వ్యాపారులు సిండికేట్‌గా మారి కృత్రిమ కొరతను సృష్టించి బియ్యం సరఫరా తక్కువగా ఉన్నందున ధరలు పెరుగుతున్నాయని నమ్మబలికే ప్రయత్నం చేస్తున్నారు. దీని వెనుక అధికారుల హస్తం ఉందని బహిరంగంగా చర్చించుకుంటున్నారు.

కానరాని తనిఖీలు..

పారిశ్రామిక, కార్మిక, మురికివాడల్లో నిరుపేద ప్రజలది రెక్కాడితేగాని డొక్కాడని పరిస్థితి. దీంతో తప్పనిసరిగా చౌకధరల దుకాణానికి వెళ్లి బియ్యం తెచ్చుకుని కడుపు నింపుకోవాల్సిన పరిస్థితి. చౌకధరల దకాణాల యజమానులు మాత్రం బియ్యం వ్యాపారులతో కుమ్మక్కై రూపాయి కిలో బియ్యాన్ని వ్యాపారులకు కిలో రూ.25 చొప్పున విక్రయిస్తూ, పేదవాడి పొట్టకొట్టి సొమ్ము చేసుకుంటున్నారు. రేషన్ డీలర్ల స్వార్థానికి నిరుపేదల ఆకలి తీర్చాల్సిన బియ్యం దారి మళ్లించి బహిరంగ మార్కెట్లోకి తరలిస్తున్నారు. ఇలా తరలించిన బియ్యాన్ని మరో బస్తాలోకి మార్చి కిలో రూ. 40 నుంచి రూ. 44 వరకు విక్రయిస్తున్నారు. దీంతో పేదవాడు మరో గత్యంతరం లేక బహిరంగ మార్కెట్లో వ్యాపారులు అమ్ముతున్న ధరలకు కొనాల్సిన పరిస్థితులు నెలకొన్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంత దోపిడీ జరుగుతున్నా పౌర సరఫరాల అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

కథనం ప్రచురితం.. కదిలిన యంత్రాంగం

నూతన విద్యుత్ స్తంభాల ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



సాక్షిలో ప్రచురితమైన కథనం




సాయిరాంనగర్ కాలనీ రోడ్ నెం-1,2లో నూతన స్తంభాలు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

చంపాపేట: చంపాపేట డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో శిథిలావస్థకు చేరిన విద్యుత్ స్తంభాలు, వేలాడుతున్న తీగలతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం సంభవిస్తోందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటూ కాలం వెల్లదీసేవారు. ఈ సమస్యలపై ఈ నెల 24న 'డేంజర్ పోల్స్' అనే శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. ఆదివారం చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ ఏడీ రాజేందర్, ఏడీఈ కేవీఎస్‌రెడ్డి, ఏఈ శ్రీనివాస్ డివిజన్ పరిధిలోని సాయిరాంనగర్, ఎస్‌జీఆర్ కాలనీ, సాయిరాంనగర్ కాలనీలోని రోడ్ నెం 01, 02, 03 లోని పెనవేసుకున్న భారీ వృక్షాల నడుమ ఉన్న విద్యుత్ స్తంభాలను మార్చి కొత్తవి ఏర్పాటు చేశారు. వేలాడుతున్న తీగలను గుర్తించి సరిచేశారు. ఎస్‌జీఆర్ కాలనీలో కూడా త్వరలో ఎత్తు తక్కువగా ఉన్న స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయనున్నట్లు డీఈ రాజేందర్ స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.